

కాళ్లలో పోలీస్ స్టేషన్ ప్రారంభం

కాళ్ల : అధునాతన వసతులతో పోలీస్ స్టేషన్ ప్రజలకు అందుబాటులో ఉండడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు అన్నారు. కాళ్లకూరు గ్రామంలో నిర్మించిన రైతు భరోసా భవనాన్ని పోలీస్ స్టేషన్‌గా ఏర్పాటు చేసిన భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ సుస్థిరంగా ఉండాలంటే గుడ్ పోలీసింగ్ ఉండాలన్నారు. స్థలదాత వేగేశ్న సూర్యచంద్రరాజు, పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆధునికీకరణ పనులను నీలాద్రి రాజు, మంతెన నరసింహమూర్తి రాజు, డాక్టర్ దాట్ల వెంకట రామరాజు, మాజీ సర్పంచి అడ్డాల శివరామరాజు, దేవస్థానం మాజీ ఛైర్మన్ అడ్డాల నాగరాజు, మాజీ జెడ్‌పిటిసి అడ్డాల పద్మావతిలు పోలీస్ స్టేషన్ నిర్మాణ పనుల నిమిత్తం విరాళాలు అందించిన దాతలను అభినందించారు. కలెక్టర్ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, ఎఎస్‌పి భీమారావు, గ్రామ సర్పంచి సాదు శ్రీదేవి, ఎపిఐఐసి ఛైర్మన్, మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజు, జుత్తిగ నాగరాజు, పాల్గొన్నారు.

ఎన్నికలా.. కమిటీలా..!

సహకార సంఘాల ఎన్నికలపై కొనసాగుతున్న ఉత్కంఠ

త్రిసభ్య కమిటీలపై కూటమి నాయకుల ఆశలు

రెండు జిల్లాల్లో 281 సహకార సంఘాల పరిధిలో పదవుల ఆరాటం

వచ్చే జూన్, జులైలో ఎన్నికలకు వెళ్లే యోచనలో ప్రభుత్వం

కంప్యూటరీకరణ పూర్తిచేసి ముందుకెళ్లేందుకు ప్రణాళిక

త్రిసభ్య కమిటీలు వేస్తే వ్యవస్థ గాడి తప్పనున్నట్లు అంచనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సహకార సంఘాల ఎన్నికలపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఎన్నికలు నిర్వహిస్తారా.. లేక ముందుగా త్రిసభ్య కమిటీలను నియమిస్తారా అన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. సహకార వ్యవస్థలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే మాత్రం ఎన్నికల నిర్వహణకే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. వచ్చే జూన్, జులైలో ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. డిసెంబర్‌లో ఇన్‌ఛార్జుల పదవీకాలం ముగిసిన తర్వాత వారిని మరో ఆరు నెలలు జూన్ వరకూ పొడిగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు అందుకు అద్దం పడుతున్నాయి. సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలను నియమించనున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతుండడంతో కూటమి పార్టీల్లో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పదవుల కోసం పెద్ద ఎత్తున లాబీయింగ్ జరుపుతున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో 159, పశ్చిమలో 122 రెండు జిల్లాలో మొత్తం 281 వరకూ సహకార సంఘాలు ఉన్నాయి. ప్రతి సహకార సంఘానికీ ముగ్గురు సభ్యుల కమిటీని నియమిస్తే దాదాపు 850కి పైగా రాజకీయ పదవులు దక్కే అవకాశం ఉంటుంది. ముగ్గురు సభ్యుల్లో ఒకరు ఛైర్మన్‌గా కొనసాగుతారు. దీంతో పదవుల కోసం నాయకులంతా తెగ ఆరాట పడుతున్న పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల టిడిపి, జనసేన మధ్య పదవుల పంపకం సైతం పూర్తయినట్లు సమాచారం. నీటి సంఘాల ఎన్నికల సమయంలో ఈ ఒప్పందం జరిగినట్లు చెబుతున్నారు. నీటి సంఘాల్లో పదవులు పొందని పార్టీ నాయకులకు సహకార సంఘాల్లో అవకాశం ఇచ్చే విధంగా చర్చలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల పదవుల పీటముడులు వీడక సిగపట్లు కొనసాగుతున్నట్లు చెబుతున్నారు. సహకార సంఘాలకు సంబంధించి ప్రభుత్వం సాగదీత ధోరణిపై నాయకుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.



కాళ్ల : యండగండి సొసైటీ

ఎన్నికల వైపే ప్రభుత్వం మొగ్గు?

సహకార సంఘాలకు ఎన్నికలు జరిగి ఏళ్లు గడిచిపోతుంది. 2013 జనవరిలో అప్పటి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించింది. వీటి గడువు 2018 జనవరితో ముగిసింది. అప్పట్లో టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా అప్పటి పాలకవర్గాలనే పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2019 జులై వరకూ ఏడాదిన్నరపాటు ఇవి కొనసాగాయి. వైసిపి ప్రభుత్వం వచ్చాక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని అంతా భావించారు. అందుకు విరుద్ధంగా త్రిసభ్య కమిటీ పేరుతో ఒకరిని ఛైర్మన్, ఇద్దరిని సభ్యులుగా నియమించి ముందుకు సాగింది. దీంతో దాదాపు ఏడేళ్లుగా సహకార సంఘాలకు ఎన్నికలు లేకుండా పోయాయి. కూటమి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ముందుకెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ ముమ్మరంగా సాగుతోంది. వచ్చే మేనాటికి కంప్యూటరీకరణ ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కంప్యూటరీకరణ పూర్తయితే ఓటర్లు ఎంతమంది అనేదానిపై పూర్తి స్పష్టత వస్తుంది. ఇకైవైసి వంటివి చేస్తుండడంతో గతంలో మాదిరిగా బినామీ తరహా ఓటర్లు ఉండే అవకాశం ఉండదని చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితిలో త్రిసభ్య కమిటీలను నియమిస్తే రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి తమకు నచ్చిన వారిని ఓటర్లుగా చేర్చే అవకాశం ఉంటుందని, కాబట్టి కంప్యూటరీకరణ పూర్తిచేసినా నేరుగా ఎన్నికలకు వెళ్లాలన్న ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే వచ్చే జూన్ వరకూ ఇన్‌చార్జులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెబుతున్నారు. త్రిసభ్య కమిటీలను నియమించే ఆలోచన ప్రభుత్వానికి ఉండి ఉంటే డిసెంబర్‌లో ఇన్‌ఛార్జుల పదవీకాలం ముగిసినప్పుడే చేసి ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూటమిలోని పార్టీల నాయకుల ఒత్తిడి మేరకు త్రిసభ్య కమిటీలంటూ చెబుతూ బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే జూన్, జులైలో సహకార సంఘాల ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావుతో కలిసి అర్జీదారుల నుంచి 149 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన అర్జీల పరిష్కారంలో జవాబుదారీ తనంతో ఉండాలని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు విచారణ చేపట్టి నిర్దేశించిన సమయంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, వయోవృద్ధుల సంక్షేమం ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద విఒఎల నిరాహార దీక్షలు ప్రారంభం

వారి సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ఒక పక్క పని ఒత్తిడి.. మరోపక్క రాజకీయ వేధింపులు.. అయినా భరించి విధులు నిర్వర్తిస్తున్నా కనీసం జీతాలు కూడా చెల్లించడం లేదు.. ఎప్పుడో ఒకప్పుడు జీతాలు వస్తాయని బాధలన్నీ దిగమింగుకొని పనిచేస్తున్న తమను తొలగించాలని ప్రభుత్వం చూడడం ఎంతవరకూ సమంజసమని, తాము కుటుంబాలతో బతికేదెలా అంటూ వెలుగు విఒఎలు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన కాలపరిమితి సర్క్యులర్ తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ జీతాలు విడుదల చేయడంతోపాటు ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకునే విధంగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. భీమవరం కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో విస్సాకోడేరు వంతెన దిగువ ప్రాంతంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం వెలుగు విఒఎలు నిరాహార దీక్షలు చేపట్టారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ దీక్షలను మొదటి రోజు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డి.కళ్యాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ వెలుగు విఒఎలు ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను గుర్తించి పరిష్కరించకపోవడం దారుణమన్నారు. కాలపరిమితి సర్క్యులర్ తెచ్చి మూడేళ్లపాటు పనిచేసిన వాళ్లను తీసేయాలనే విధానాన్ని తీసుకురావడం అన్యాయమన్నారు. దీనివల్ల వారి ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతోందన్నారు. వెంటనే ఈ సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డి.కళ్యాణి మాట్లాడుతూ ఒకపక్క ధరలు విపరీతంగా మండుతున్నాయన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా జీతాలు పెంచలేదన్నారు. కనీసం ఇచ్చే అరకొర జీతాలు కూడా ఐదు, ఆరు నెలల నుంచి ఇవ్వకుండా బకాయిలు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ జీతాలను విడుదల చేయాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. రాజకీయ వేధింపులను అరికట్టాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా విఒఎల సమస్యలను పరిష్కరించే దిశగా ఆలోచించాలని లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతి బాబు దీక్షలకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఈ దీక్షల్లో జి.లక్ష్మి, మంగతాయారు, విజయ, శిరీష, నాగమణి, రేవతి, శేషారత్నం పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కళ్యాణి

కాలుష్యం పేరుతో ఇళ్ల తొలగింపు దుర్మార్గం

కలెక్టరేట్ వద్ద పాలకోడేరు ఎఎస్ఆర్ నగర వాసుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

40 ఏళ్ల నుంచి తినీతినక ఇళ్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న 130 నిరుపేద కుటుంబాల ఇళ్లను పంట బోదెల కాలుష్యం పేరుతో తొలగించాలని చూడడం అత్యంత దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. పాలకోడేరు ఎఎస్ఆర్.నగర్ ప్రాంతవాసులు తమ ఇళ్ల తొలగింపును నిలుపుదల చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేసి బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా 40 ఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నామని, తమ ఇళ్లను తొలగించే కార్యక్రమం నిలుపుదల చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డిఆర్‌ఒ పంచాయతీ, ఇరిగేషన్ అధికారులకు విషయాన్ని చెప్పి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ జిల్లాలో అనేక పరిశ్రమల నుంచి ఆక్వా చెరువుల నుంచి పంట బోదెలను కాలుష్య కోరలు పెంచే విధంగా తయారు చేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి శేషపు అశ్రియ్య మాట్లాడుతూ కొద్దిమంది వ్యక్తుల ప్రయోజనాల కోసం ఇళ్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కాలుష్యాన్ని బూచిగా చూపించడం సరికాదని తెలిపారు. వెంటనే పంచాయతీ వారిచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అక్కడ నివసిస్తున్న వారందరికీ ఊరిలోనే ప్రభుత్వం మూడు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యం కల్పించి అప్పుడు వారి ఇళ్లు తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తమ్మినీడి వెంకటరమణ, దొంగ నాగరాజు, జోగి నరసింహమూర్తి, గుడాల బుల్లెమ్మ, గుడాల లక్ష్మి, నాగవరపు, ఈశ్వరి, మెజ్జాడ మల్లి పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న బాధితులు, నేతలు

కాలకృత్యాలకు రూ.10 వసూలు సరికాదు

డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి - నరసాపురం

ఆర్‌టిసి బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఉపయోగించుకున్న ప్రయాణికుల నుంచి పది రూపాయలు వసూలు చేయడం ఆపాలని డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎన్.సురేంద్రవర్మకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం.త్రిమూర్తులు మాట్లాడుతూ బస్టాండ్ ప్రతి రోజూ వందలాది మంది ప్రయాణికులతో ఉంటుందని తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు, మరుగుదొడ్లకు వెళ్లిన ప్రయాణికుల నుంచి నిబంధనలకు వ్యతిరేకంగా అధిక మొత్తంలో పది రూపాయలు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రయాణికులే కాకుండా పట్టణంలోని వివిధ షాపుల్లో పనిచేస్తున్న కార్మికులు, వ్యాపారులు బస్టాండ్‌కు వచ్చి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారని, వారి నుంచి పది రూపాయలు వసూలు చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ పరిసరాల ప్రాంతంలో బహిరంగ మూత్ర విసర్జన చేయకుండా గోడలపై వాల్ రైటింగ్ హెచ్చరిక బోర్డులు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కేతినీడి వెంకటేశ్వరరావు, బూడిద జోగేశ్వరరావు, పొగాకు నారాయణరావు, కోడి లక్ష్మణ్ పాల్గొన్నారు.



ఆర్‌టిసి అధికారులకు వినతిపత్రాన్ని అందిస్తున్న సిపిఎం నాయకులు

తగ్గిన చలి.. పెరిగిన మంచు..

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో గత కొన్ని రోజులుగా చలితో ప్రజలు వణికిపోయారు. ఉదయం, సాయంత్రం తేడా లేకుండా చలి తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో జనం ఉన్ని దుస్తులు వేసుకోవడంతోపాటు పలు రక్షణ చర్యలు తీసుకున్నారు. అయితే సంక్రాంతి పండుగ వెళ్లిన నాటి నుంచి కాస్త చలి తగ్గింది. ఈ తరుణంలో ఉదయం వేళలో మాత్రం పొగ మంచు దట్టంగా పట్టడంతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ మంచు కమ్మేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి తగ్గి పొగమంచు దట్టంగా పట్టడంతో మధ్యాహ్న సమయంలో ఎండ కూడా కొద్దిగా పెరిగింది.

ఇంటింటా కులగణన సర్వే చేయాలి

అభ్యంతరాలపై తేదీ పొడిగించాలి

కెవిపిఎస్ రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్‌సి, ఎస్‌టిల కులగణన సర్వేను ఇంటింటికి తిరిగి చేయాలని కెవిపిఎస్ రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత, ప్రజాసంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టిల కులగణనపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ప్రారంభ ఉపన్యాసం చేశారు. గత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన అస్పష్టంగా ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు తెలియకుండా కులగణన చేపట్టి, ఇప్పుడు అదే కులగణన వివరాలను ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం బహిరంగపరచడం అన్యాయం అన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలకు పరిమితమై ఆన్‌లైన్‌లో సర్వే చేపట్టి, సర్వే చేసినట్లు చెప్పడం హాస్యాస్పదమన్నారు. చట్టబద్ధతలేని సర్వేను ఎలా ప్రామాణికంగా తీసుకుంటారని ప్రశ్నించారు. ఎస్‌సి, ఎస్‌టిల సమగ్ర కులగణన కోసం కలిసి వచ్చే అన్ని దళిత ప్రజాసంఘాలతో కలిపి ఐక్య ఉద్యమాలు చేస్తామన్నారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర కుమార్, బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోన జోసెఫ్, ఎపి భజన జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బిరుదు గడ్డ రమేష్ బాబు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.బలరాం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అవలంబిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని మండిపడ్డారు. 76ఏళ్ల గణతంత్ర రాజ్యంలో నేటికీ అణిచివేయబడే ప్రజలు అభివృద్ధికి దూరంగానే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు అదే రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, మతోన్మాద విధానాలతో ప్రజల మధ్య వైశమ్యాలను బిజెపి ప్రభుత్వం మరింత పెంచుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, రిటైర్ రైల్వే ఉద్యోగి, దళిత సీనియర్ నాయకులు కెసి.రాజు, అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఈది రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం

30న భీమవరానికి విశాఖ ఉక్కు పరిరక్షణ యాత్ర

స్వాగతం పలికేందుకు సిద్ధమవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన విశాఖ ఉక్కు పరిరక్షణ యాత్ర ఈనెల 30వ తేదీన భీమవరం చేరుకోనుందని ఈ నేపథ్యంలో ప్రజానీకమంతా స్వాగతం పలికేందుకు సిద్ధమవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. స్థానిక వెంటే వారి తోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నెల్లూరులో సిపిఎం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నామని, దీనిలో బాగంగా ఈ యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. విశాఖపట్టణం విశాఖ స్టీల్‌ప్లాంటు నుంచి నెల్లూరు వరకు ఈ యాత్ర సాగుతుందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, దీని పరిరక్షణ మనందరిపై ఉందన్నారు. ఈ యాత్రలో ప్రజానీకమంతా పాల్గొని స్వాగతం పాలకాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటించినంతమాత్రాన దాని సమస్య శాస్వతంగా పరిష్కారం కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని తామే కపాడినట్లు, ఉద్దరించినట్లుగా చెప్పుకుంటుందన్నారు. కొద్దిరోజుల క్రితం కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ మీడియాతో మాట్లాడారని ఆయన చేసిన వ్యాఖ్యలు మరోసారి ఆలోచించుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అప్పుల్లో ఉంది సెయిల్‌లో విలీనం చేయడం ఎంతమాత్రాం సాధ్యం కాదు అని చెప్పడం ఆందోళనకరమన్నారు. అసలు ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. సెయిల్ ఒక ప్రభుత్వ సెక్టార్ కదా, ప్రభుత్వానికి మించిన అధికారాలు ఏమైనా సెయిల్‌కి ఉన్నాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వమే దీనికి బొగ్గు ఘనులు కేటాయిస్తే అప్పుల్లో ఎందుకుంటుందని ప్రశ్నించారు. ఉద్దేశ పూర్వకంగానే ప్రభుత్వం దీనిని నాశనానికి పూనుకుంటోందని ఆరోపించారు. ప్రజానీకమంతా ఈ విషయాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలనే డిమాండ్లతో ఈ విశాఖ ఉక్కు పరిరక్షణ యాత్ర సాగుతోందన్నారు. దీనికి ప్రజలంతా స్వాగతం పలికి మద్దతు తెలపాలని కోరారు.

పిహెచ్‌సి నిర్మాణ పనులు ప్రారంభించాలి

సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి చిన వీరభద్రరావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

వేల్పూరులో నిలిచిపోయిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తణుకు డిప్యూటీ తహశీల్దార్ ఎన్.శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన వీరభద్రం మాట్లాడుతూ మండలంలో ఉన్న వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా తొమ్మిది గ్రామాల ప్రజలకు నిరంతరం ఎనలేని వైద్య సేవలు అందుతున్నాయన్నారు. గర్భిణులు, బాలింతలు, సాధారణ రోగుల సంఖ్య ఇటీవల పెరిగిందని, దానికి అనువైన భవన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. 2019 ఫిబ్రవరిలో 30 పడకల ఆసుపత్రిగా స్థాయిని పెంచి మరింత విస్తృతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో సామాజిక ఆరోగ్య కేంద్ర భవనం నిర్మాణం కోసం రూ.3 కోట్లు కేటాయించి నిధులు మంజూరు చేసిందన్నారు. భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందని, అనంతరం రాష్ట్రంలో 2019లో ఎన్నికలు జరిగిన తర్వాత ప్రభుత్వం మారటంతో పనులు నిలిచిపోయాయన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం అని పదేపదే చెప్పుకోవడం తప్ప ఇప్పటికీ 8 నెలలు కావస్తున్నా భవన నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబటి రామకృష్ణ, యండమూరి నాగేంద్ర, కె.నరసింహారావు, వాస పోసయ్య, తాళ్ల సత్యనారాయణ, బొక్క మోహన్ రావు పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

కొలువుల సాధనకు సాంకేతిక నైపుణ్యాలే కీలకం

ఎపి నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి

తాడేపల్లిగూడెం : కొలువుల సాధనకు సాంకేతిక నైపుణ్యాలే కీలకమని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెంటర్(ఐఐసి) ఆధ్వర్యంలో సోమవారం బిటెక్ విద్యార్థులకు హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వేసే ప్రతి అడుగు వారి విజయానికి మెట్టుగా నిలబడాలని చెప్పారు. విభిన్న ఆలోచనలు ప్రతి విద్యార్థి జీవితంలో భాగం కావాలని, అవి వారి వ్యక్తిత్వానికి మెరుగులుదిద్దేలా ఉండాలన్నారు. విద్యార్థుల్లో దాగివున్న సాంకేతిక, సృజనాత్మకతను వెలికితీసేందుకు, వినూత్న పరిష్కారాలను కనుగొనడానికి ఇటువంటి హ్యాకథాన్ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆలోచనా విధానంతోపాటు సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపడతాయని చెప్పారు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు నూతన సాంకేతికతలపై పట్టు సాధించి కొత్త కొత్త యాప్‌లు, సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆచార్యులు కృష్ణచైతన్య మాట్లాడుతూ హ్యాకథాన్ ప్రాధాన్యత గురించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ కార్తికేయ శర్మ పాల్గొన్నారు.

సామాన్యుడిలా మంత్రి నిమ్మల


ప్రజాశక్తి - నరసాపురం

మంత్రి నిమ్మల రామానాయుడు ఎప్పుడూ సామాన్య జీవితమే గడుపుతుంటారు. సోమవారం విజయవాడ వెళుతూ మార్గమధ్యలో నరసాపురం రహదారి వెంబడి ఉన్న చిన్నపాటి హోటల్‌కి వెళ్లి టిఫిన్ చేశారు. అంతేకాదు అక్కడ ఆయనను కలిసిన సామాన్య ప్రజలతో మమేకమయ్యారు. ఓ పక్క రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనితీరుని చెబుతూనే మరోపక్క వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో అక్కడున్న వారంతా ప్రజా నాయకులు అంటే ఇలా ఉండాలంటూ పాలకొల్లు నియోజకవర్గానికి, మన రాష్ట్రానికి మంచి ప్రజా నాయకులు దొరికారని ప్రజలు ప్రశంసల వర్షం కురిపించారు.

ఘనంగా రాయల జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు

విజయనగర సామ్రాజ్య చక్రవర్తి 'శ్రీకృష్ణదేవరాయల పాలన'లో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, సాహితీరంగాలలో సమగ్రాభివృద్ధి జరిగిందని, రత్నాలను రాసులుగా పోసి నడిబజారులలో విక్రయించేవారని మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు అన్నారు. మత సామరస్యంతో సకలజనులు సుఖ సంతోషాలతో వుండేవారని తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి ఆధ్వర్యంలో రాయల 554వ జయంతి సందర్భంగా సోమవారం పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో వున్న రాయల విగ్రహానికి అభిమానులు పూలమాలలతో ఘన నివాళులు సమర్పించారు. వడ్డించిన విస్తరి నోటి దగ్గర వున్నా.. అరచేతి ఐదు వేళ్ల ఐక్యంగా ఉండి నోటికి అందించకపోతే మన ఆకలి తీరదు అన్న నానుడిగా రాయలు గొప్ప రాజనీతి, గొప్ప ఆర్థిక నిపుణుడు, గొప్ప సైన్యాధ్యక్షుడు, బుజభల సంపన్నుడు, పరమత సహనం పాటించే వైష్ణవభక్తుడు, ఢిల్లీ ముస్లీం సామ్రాజ్యవాదులను దక్షిణ భారత దేశంలో అడుగిడనివ్వకుండా నిలువరించిన వీరాధి వీరుడు, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన చక్రవర్తని వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం తెలిపారు. గుత్తుల సత్యనారాయణ మూర్తి, సంగినీడి వెంకట రంగారావు, గంటా శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి వంకా రవీంద్ర

సమన్వయంతో పనిచేయాలి : ఎంఎల్‌సి

ప్రజాశక్తి - తణుకు రూరల్

గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు, గ్రామ సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని ఎంఎల్‌సి వంక రవీంద్ర పేర్కొన్నారు. ఎంపిపి రుద్రా ధనరాజు సోమవారం నిర్వహించిన తణుకు మండల పరిషత్ సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధితోపాటు, ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలు అందే విధంగా చూడాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ముళ్లపూడి అన్నపూర్ణ దేవి, ఎంపిటిసిలు, ఎంపిడిఒ ఆర్.లోహిత్ జైసాగర్, ఎఒ వి.కృష్ణచంద్రరావు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎస్ఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్, సబ్జెక్టులో అతిథి అధ్యాపకుల నియామకంకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజారాజేశ్వరి తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, డిగ్రీ కలిగి 55 శాతం ఆపైన మార్కులు కలిగి ఉన్న అభ్యర్థులు, అదనపు అర్హతలు పిహెచ్‌డి, నెట్, ఎపి సెట్, బోధన అనుభవం కలిగి ఐసిటి టూల్స్ ద్వారా ఆన్‌లైన్, ఆఫ్లైన్ విధానం ద్వారా బోధించ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడునన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులు, సర్టిఫికెట్లను ఫిబ్రవరి 5 వరకు కళాశాల ఆఫీస్‌లో అందజేయాలని కోరారు. లేదా మెయిల్ ద్వారా తమ దరఖాస్తులను పంపవలెనన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావలెనని తెలిపారు.

29న కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పురపాలక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి సకాలంలో కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఘనంగా నరసింహరాజు పుట్టినరోజు

కాళ్ల : రాబోయే రోజుల్లో ప్రజలు మరలా వైసిపికి పట్టం కట్టి అధికారంలోకి తీసుకొస్తారని ఎంఎల్‌సి కౌరు శ్రీను అన్నారు. మండలంలోని పెదఅమిరం వైసిపి కార్యాలయంలో ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వివిఎల్ నరసింహరాజు జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ కేకును కట్ చేశారు. ఎంపిపిలు ఇందుకూరి శ్రీహరి నారాయణరావు, కరిమెరక జయలక్ష్మి, జెడ్‌పిటిసి యండగండి శ్రీను, వచ్చిగోళ్ల సోమేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు వేగేశ్న జయరామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అవార్డుల పట్ల హర్షం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ సర్వీసు అవార్డును కలెక్టర్ నుంచి స్వీకరించిన మండల విద్యాశాఖ అధికారులు ఎన్.శ్రీనివాసరావు, వేంద్ర వెంకటేశ్వరరావులను భీమవరం పట్టణ ఉపాధ్యాయులు లూథరన్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సోమవారం సత్కరించారు. సభలో ఉద్యోగ విద్యాశాఖ అధికారులను ఉద్దేశించి పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించిందుకు కృషిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు, కె.సాయిరాం, సిహెచ్.రాఘవ ప్రసాద్, ఎన్.శ్రీనారాయ భగవాన్ రాజు, వి.విశ్వనారాయణ పాల్గొన్నారు.

పెనుమంట్ర : 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నాగరాణి, జెసి, ఎస్‌పి, ఉన్నతాధికారుల సమక్షంలో జిల్లా ఉత్తమ ఉద్యోగి అవార్డు, ప్రశంసాపత్రం పొందిన స్థానిక ఎంపిడిఒ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ చింతపల్లి ఉదయ్ కిరణ్‌ను పలువురు అభినందించారు. ఈమేరకు ఎంపిపి కర్రి వాసుదేవ్, జెడ్‌పిటిసి కర్రి గౌరి సుభాషిణి, ఎంపిటిసిలు, ఎంపిడిఒ, బివిఎస్‌వి.శర్మ, స్థానిక కార్యాలయ సిబ్బంది అభినందించిన వారిలో ఉన్నారు.

గణపవరం : పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సు మేరీకోస్ రోగులకు అత్యంత సేవలందించినందుకు భీమవరంలో జరిగిన గణతంత్ర వేడుకలలో ఉత్తమ అవార్డును డిఎంహెచ్‌ఒ బానునాయక్ నుంచి అందుకున్నట్లు సోమవారం తెలిపారు. మేరీకోస్‌కి అవార్డు వచ్చినందుకు డాక్టర్ ప్రియాంక, ఎంపిహెచ్‌ఒ వెంకటేశ్వరరావు, ఆసుపత్రి సిబ్బంది, సర్పంచ్ కారబందీ అభినందించారు.

మాజీ వార్డు మెంబర్ రాఘవులు మృతి

పెనుగొండ : గ్రామాభివృద్ధికి ఎన్నో మంచి పనులు చేసి కాంగ్రెస్‌లో అనేక పదవులను, విధులు నిర్వహించి పెనుగొండ పంచాయతీ వార్డు మెంబర్‌గా చేసిన కండిబోయిన చిన వెంకట రాఘవులు(104) వృద్ధుడు సోమవారం తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని బంధువులు తెలిపారు. ఇతనికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

లోకేష్ యువగళం పాదయాత్రకు రెండేళ్లు

భీమవరం టౌన్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రతిష్ట నాయకునిగా రాష్ట్రంలో నిర్వహించిన యువగళం పాదయాత్ర కుప్పంలో ప్రారంభించి నేటికి రెండేళ్లు పూర్తవుతున్నాయని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి తెలిపారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యువగళం పాదయాత్ర ద్వారా రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలను లోకేష్ స్వయంగా కలిసి వారి సమస్యలను గుర్తించి, వైసిపి అరాచక పాలనలో జరిగిన దురాగతాలను, అరాచకాలను, దౌర్జన్యాలను ఎదిరించి పాదయాత్రను దిగ్విజయంగా పూర్తి చేసి అధికారంలోకి రావడానికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు.



ఎంపిడిఒకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ఉపాధి కార్మికులపై రాజకీయ వేధింపులు తగవు

సిఐటియు ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి - కాళ్ల

నిరంతరం గ్రామాల్లో వ్యవసాయ కార్మికులకు ఉపాధి చూపించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న ఉపాధికార్మికులపై రాజకీయాలు చేయటం మంచిది కాదని సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ పేర్కొన్నారు. కాళ్ల సిఐటియు ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తహశీల్దార్, ఎండిఒ, ఎపిఎంలకు సోమవారం వినతి పత్రాలను అందజేశారు. కర్నూలు జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను మర్డర్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చెప్పే మాటలకు, క్షేత్రస్థాయిలో జరిగే ఘోరాలకు ఫీల్డ్ అసిస్టెంట్‌లచే నిరూపితం చేస్తుందన్నారు. రాష్ట్రంలో చిన్నపాటి ఉద్యోగులపై, ప్రజలకు సేవలు అందిస్తున్న వారిపై రాజకీయకక్షలకు దిగటం దారుణమన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా నాయకులు భవాని మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యోగ భద్రత కల్పించాలని, జరిగిన విషయంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి, రాష్ట్ర వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్లు, సంఘం నాయకులు ఏడుకొండలు, రాజు, దాసరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 26 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మొగల్తూరు : మొగల్తూరులో సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మూడు వినతులు అందాయని తహశీల్దార్ కె.రాజ కిషోర్ తెలిపారు. భూ సమస్య పరిష్కారం కోరుతూ రెండు, పెన్షన్ కోరుతూ ఒకటి వినతులు వచ్చాయని తెలిపారు.

ఆర్‌డిఒ దాసిరాజుకు డాక్టర్ నూలి అభినందనలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజుకు స్థానిక బిజిబిఎస్ మహిళ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, వాసవి క్లబ్ అధ్యక్షుడు, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ నూలి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదగా ఉత్తమ అవార్డు అందుకున్న దాసిరాజును సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నూలి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఆర్‌డిఒ రాజు ఏ ఉద్యోగంలో ఉన్నప్పటికీ అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ అధికారిగా అవార్డులు తీసుకోవడం తమ ప్రాంతానికి గర్వకారణం అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ అవార్డులను ఆయన అందుకోవాలని శ్రీనివాస్ ఆకాంక్షించారు.



ఆర్‌డిఒకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్

గీత పనివారికి ఎక్సైజ్ పరిధిలో షాపులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

తణుకు ఎక్సైజ్ శాఖ పరిధిలోని నాలుగు మండలాల్లో గీత పనివారికి కేటాయించిన నాలుగు షాపులకు దరఖాస్తులు కోరుతూ నేడు నోటిఫికేషన్ విడుదల అయ్యిందని ఎక్సైజ్ సిఐ సత్తి మణికంఠ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తణుకు రూరల్, పెనుగొండ మండలాలకు శెట్టి బలిజలకు, ఇరగవరం, పెనుమంట్ర మండలాలకు గౌడలకు షాపులు కేటాయించి నందున, వారి నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. అర్హులు రూ.2 లక్షల డిపాజిట్‌తో తగిన పత్రాలు నేరుగా కానీ, ఆన్‌లైన్‌లో కానీ దరఖాస్తు చేసుకోవచ్చని, ఫిబ్రవరి 6న వచ్చిన దరఖాస్తులు పరిశీలించి 7వ తేదీన డ్రా తీసి, అదే రోజు షాపులు వచ్చిన వారికి సమాచారం ఇవ్వడం జరుగుతుందని సిఐ పేర్కొన్నారు.

నరసాపురం : నరసాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 3 మద్యం దుకాణాలను గీత కార్మికులకు కేటాయించినట్లు సిఐ ఎస్.రాంబాబు తెలిపారు. నరసాపురం మండలం, టౌన్, మొగల్తూరు మండలంలో ఒక్కో షాపు శెట్టిబలిజ కులానికి కేటాయించినట్లు చెప్పారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రూ.2 లక్షల రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 6న వాటిని పరిశీలించి, ఏడో తేదీ ఉదయం లాటరీ పద్ధతిలో దరఖాస్తుదారులను ఎంపిక చేస్తారని అన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

పంచేంద్రియాలలో నేత్రాలు ప్రధానమైనవని, వాటిని సంరక్షించుకునేందుకు నేత్ర వైద్య శిబిరాలు ఉపయోగపడతాయని చెరుకువాడ గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు అన్నారు. మండలంలోని చెరుకువాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్పంచి కొండవీటి సాంబశివరావు సహకారంతో భీమవరం ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పెన్మత్స సూర్య సౌమిత్ ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లు, కళ్లజోళ్లు అవసరమైన వారికి అతి తక్కువ ధరకే అందజేస్తామని డాక్టర్ సూర్య సౌమిత్ అన్నారు. సర్పంచి సాంబశివరావు మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి సనాతన, ఇర్రింకి సత్యనారాయణ, కొండవీటి నాగవెంకట సత్యనారాయణ, పెన్మత్స హిమాద్రి రాజు, కుచ్చు శివకృష్ణ పాల్గొన్నారు.



వృద్ధులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు సిఎస్ఆర్ ఫండ్స్ అందజేసి భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ నాగరాణిని ఉండి మండలం వాంద్రం గ్రామం వెల్కమ్ ఫిషరీస్ లిమిటెడ్ అధినేత కె.సౌదాలతీఫా కలిసి సిఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.25 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ అభివృద్ధి అంతా ప్రభుత్వ వ్యయంతోనే చేపట్టాలంటే సాధ్యం కాదని, వివిధ వర్గాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ నిబంధనల మేరకు సిఎస్ఆర్ ఫండ్స్ రెండు శాతం నిధులను జిల్లా యంత్రాంగానికి అందజేయాలన్నారు. ప్రభుత్వం, ప్రజలు భాగస్వామ్యంతో జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చెక్కు అందించిన వారిలో సౌదాలతీఫా తండ్రి కె.ఆనంద్ ఉన్నారు.



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న సౌదాలతీఫా

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వర్తకులు, ఆఫీస్ సిబ్బందితో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కాలుష్యం పెరిగిపోవడంతో జబ్బులు వస్తున్నాయని అన్నారు. దీనిని అరికట్టవలసింది మనమే అన్ని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాయని, ప్లాస్టిక్ నిషేధించాలని కోరుతున్నాయని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన స్టడీ మెటీరియల్ అందజేత



టెస్ట్ పేపర్స్ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి చదువుకోవాలని, పాఠ్యాంశ మెటీరియల్‌ను ఉపయోగించుకుని మంచి మార్కులు సాధించాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య అన్నారు. మాలవానితిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో యుటిఎఫ్ 10వ తరగతి టెస్ట్ పేపర్స్ విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.ఎ.స్వామి మాట్లాడుతూ యుటిఎఫ్ వారు తయారు చేసిన ఈ మోడల్ పేపర్స్ చాలా ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ప్రణాళికాబద్ధంగా వారానికి ఒక టెస్టుపేపర్ చదివి, పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ సుదూర, మారుమూల ప్రాంతంలో ఉన్న మన మాలవానితిప్ప హై స్కూల్ విద్యార్థులు బాగా చదివి, మంచి మార్కులు సంపాదించి జీవితంలో ఉన్నత స్థితిలో ఉండాలని ఆకాంక్షించారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు వెంకటరత్నం మాట్లాడుతూ పిఎస్ సబ్జెక్టు, బయాలజీ సబ్జెక్టులు ఈ టెస్ట్ పేపర్స్‌లో ఉన్న నాలుగు పేపర్లను పరిశీలించానని, విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా 70 నుంచి 90 శాతం వరకు మార్కులు సాధించడానికి యుటిఎఫ్ టెస్ట్ పేపర్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఎస్‌వి.కుమారి, యుటిఎఫ్ కాళ్ల మండల అసోసియేట్ అధ్యక్షులు డి.కనకదుర్గ పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లు వేస్తే చర్యలు

ప్రజాశక్తి - వీరవాసరం

మత్స్యపురి గ్రామ పంచాయతీ పరిధిలో అనధికారికంగా వెలుస్తున్న లేఅవుట్‌లపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకురాకుండా వెలుస్తున్న ఈ లేఅవుట్‌ల పట్ల ప్రజాప్రతినిధుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతుంది. తక్షణమే పంచాయతీ కార్యదర్శి అనధికార లే అవుట్‌లపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న ఈ తరహా లే అవుట్‌లలో ఇండ్ల స్థలాలు కొనుగోలు చేసే వారు వాస్తవ పరిస్థితులను తెలుసుకుని కొనుగోలు చేసుకోవాలని, లేనిపక్షంలో పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు పొందలేరని అధికారులు హెచ్చరిస్తున్నారు. కొనుగోలు దారులు మోసపోకుండా అనధికార లేఅవుట్‌లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు రావడంతో ఆమె సోమవారం ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. మత్స్యపురి దళితవాడ సమీపంలో ఉన్న ఒక అనధికార లే అవుట్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

దావోస్ పర్యటనతో ఎపిలో పరిశ్రమలు

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

దావోస్ వేదికగా ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సులో ఎపి బ్రాండ్‌ను చంద్రబాబు చాటి చెప్పారని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మన రాష్ట్రానికి భారీ పెట్టుబడులే లక్ష్యంగా సాగిన చంద్రబాబు 4 రోజులపాటు జరిగిన దావోస్ పర్యటన పూర్తిగా విజయవంతం అయిందన్నారు. ఫలితంగానే ప్రపంచంలోని ప్రముఖ సంస్థలు, అధిపతులు బడా కంపెనీలు, పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు బలమైన అడుగులు పడ్డాయి అన్నారు. మన రాష్ట్రంలో ఉన్న అపారమైన వనరులను పారిశ్రామికవేత్తలకు వివరించి మౌలిక వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చి, రాష్ట్రానికి రమ్మని ఆహ్వానించారు. నాడు జగన్ ప్రభుత్వంలో లూలు, జాకీ, అమర్ రాజా, కియో, విస్తరణ వంటి పరిశ్రమలు ఎన్నో రాష్ట్రం వదిలి పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయని, పారిశ్రామికవేత్తలు సైతం రావాలంటే భయపడే వారని మంత్రి తెలిపారు. దీనిని బట్టి గత ప్రభుత్వంలో విధ్వంసం ఏవిధంగా జరిగిందో అర్థమవుతుందన్నారు.

లోకేష్‌కి అభినందనలు, కృతజ్ఞతలు

రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వ రాక్షస పాలన రాజ్యమేలుతున్న తరుణంలో ప్రజలు భయంకపితులై ఆందోళనలో ఉన్న సమయంలో నారా లోకేష్ యువగళం పేరిట జరిపిన పాదయాత్ర ఎంతో సాహసోపేతం, చారిత్రాత్మకమని మంత్రి రామానాయుడు తెలిపారు. లోకేష్ జరిపిన యువగళంతో రాష్ట్ర రాజకీయ చిత్రపటం మారడమే కాకుండా నేటి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ సందర్భంగా లోకేష్‌కు ప్రత్యేక అభినందనలు వ్యక్తపరిచారు.

నరసాపురం : కూటమి అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలో రాష్ట్రంలో 50 కంపెనీలు సుమారు రూ.5 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయని ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎం.ఎ.షరీఫ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్త పెట్టుబడుల వల్ల రాష్ట్రంలో 40 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. చంద్రబాబు, నారా లోకేష్ దావోస్ పర్యటన విజయవంతమైందని, అనేక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు షరీఫ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, అధికారి అనంతరామారావు పాల్గొన్నారు

భీమవరం టౌన్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్‌తో పాటు దావోస్‌లో పర్యటించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎపిఐఐసి ఛైర్మన్ టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో రామరాజు మాట్లాడుతూ దావోస్ పర్యటనను జీర్ణించుకోలేని వైసిపి నాయకులు అసత్య ప్రచారాలతో పెట్టుబడిదారులను భయపెట్టి, దారి మళ్లించే ప్రయత్నం చేయటం అవివేకం అన్నారు. భవిష్యత్ తరాల కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్న నారా లోకేష్‌కు మంచి భవిష్యత్ ఉందని, త్వరలోనే ఎపికి అనేక పరిశ్రమలు రానున్నాయని తెలిపారు.

తణుకు : కూటమి నాయకుల సమీక్షతో రాష్ట్రం ప్రగతి పథంలో నిలుస్తుందని తణుకు నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం జాతీయ రహదారిలో ఉన్న స్థానిక భోగవల్లి బాపయ్య, అన్నపూర్ణమ్మల కాకతీయ కళ్యాణ మండపంలో కూటమి నాయకులతో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ నియంతృత్వాన్ని, నిర్బంధాలను దాటుకుని రాష్ట్రంలో 11 ఉమ్మడి జిల్లాల్లో 226 రోజుల పాటు 3132 కిమీ సాగిన చారిత్రాత్మక యువగళం పాదయాత్ర మొదలై నేటికీ రెండేళ్లు అని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు దావోస్ పర్యటన విజయవంతం అయ్యిందన్నారు. పెద్ద ఎత్తున కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ జియోగ్రాఫిక్ డే

భీమవరం టౌన్ : స్థానిక ఆదిత్య స్కూల్లో సోమవారం స్కూల్, వాసవి క్లబ్ భీమవరం ఆధ్వర్యంలో నేషనల్ జియోగ్రాఫిక్ డే ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ డైరెక్టర్ డాక్టర్ లయన్ కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ నేషనల్ జియోగ్రాఫిక్ మ్యాగజైన్ 1888 నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ స్థాపించిదని తెలిపారు. దీని ముఖ్య ఉద్దేశం భౌగోళిక శాస్త్రం గురించి సమాచారాన్ని వ్యాప్తి చేసి పర్యావరణం మీద అందరికీ అవగాహన తెలిపి, భవిష్యత్ తరాలకు ఆనందం, ఆరోగ్యంగా జీవించేలా చేయడమన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ విపత్తులు, సునామి, భూకంపాలు అమెరికాలో ప్రస్తుతం జరుగుతున్న అగ్ని కారు చిచ్చు లాంటివి జరగకుండా జియో గ్రాఫిక్ బ్యాలెన్స్ ఎంతో అవసరమని విద్యార్థులకు సూచించారు. పర్యావరణపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. బి.యుగ సుధా, మహాలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

గ్రామపంచాయతి కార్యాలయం, కలిదిండి

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. 01/2025 తేది.20-01-2025

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, కలిదిండి గ్రామపంచాయితీ నందు ఈ క్రింది పనులు 2025-26 సం॥నకు నిర్వహించుటకు గాను ది. 03-02-2025 తేది మధ్యాహ్నం గం॥ 12.00లకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను టెండర్లు దారుల సమక్షమున మధ్యాహ్నం గం॥ 12.30 ని॥లకు తెరవబడును. ఇతర వివరములు కార్యాలయం నందు సంప్రదించవచ్చును.

వ.నెం.	పని వివరము	కావాల్సిన వ్యక్తులు	ధరావత్తు	పని కాలము
1	పారిశుద్ధ్య పనులు స్వీపర్లు-5 డ్రైవర్స్-2	7	రూ. 5000/- లేక సాల్వేన్సి	1-4-2025 టు 31-03-2026
2	కాంట్రాక్టు వాచ్ మెన్ చెరువు కాపలా	1	రూ. 5000/- లేక సాల్వేన్సి	1-4-2025 టు 31-03-2026
3	కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్లు	2	రూ. 5000/- లేక సాల్వేన్సి	1-4-2025 టు 31-03-2026
4	కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్ అసిసెంట్లు	2	రూ. 5000/- లేక సాల్వేన్సి	1-4-2025 టు 31-03-2026

నోట్: 1. పైన తెలిపిన పనులు కాకుండా పంచాయతీకి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను. 2. ఈ గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి పేమెంటు ఇవ్వబడును. 3. గతంలో ఈ పంచాయితీలో పని చేసిన వారికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వబడును.

సం/- శ్రీ ఆర్.వి.ఉదయ్‌కుమార్, పంచాయితీ కార్యదర్శి, కలిదిండి గ్రామపంచాయితీ
సం/- శ్రీమతి ఎం.మారుతి ప్రసన్న, సర్పంచ్, కలిదిండి గ్రామపంచాయితీ

మానవత ఆధ్వర్యాన కెరీర్ గైడెన్స్

ఉండి : మానవత ఉండి మండల శాఖ ఆధ్వర్యంలో ఉండి, చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివే విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వై.రామలక్ష్మి అధ్యక్షతన ముఖ్యఅతిథిగా కెవి.సుబ్బరాజు, కలిగొట్ల గోపాల శర్మ పదో తరగతి విద్యార్థులకు నైతిక విలువలు, సత్ప్రవర్తన, జీవితంలో లక్ష్యం వైపు ఎలా పయనించాలి అనే అంశాల గురించి కూలంకషంగా వివరించారు. అనంతరం పదో తరగతిలో ఈ సంవత్సరంలో ఇప్పటివరకు జరిగిన పరీక్షలలో మెరిట్ విద్యార్థులకు పెద్దబాలశిక్ష, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా కమిటీ సభ్యులు వెంకటపతి రాజు, రుద్రరాజు సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.



శామ్యూల్‌తో కార్యాలయ సిబ్బంది

ఎంపిడిఒగా శామ్యూల్ బాధ్యతలు

పెనుమంట్ర : పెనుమంట్ర ఎంపిడిఒగా అదనపు బాధ్యతలు అత్తిలి మండల పరిషత్ అభివృద్ధి అధికారి అయిన పి.శామ్యూల్ సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అదనపు బాధ్యతలు నిర్వహించిన స్థానిక మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బివిఎస్‌వి.శర్మ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది ఆయన్ని అభినందించారు.

నేరాలు - ఘోరాలు

ప్రేమిస్తున్నానని మోసం..

ఉండి: యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఉండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోలమూరు గ్రామానికి చెందిన చొప్పెల షారోన్ రోజా అనే యువతని అదే గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే యువకుడు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని వెంటపడి, ప్రేమించిన తర్వాత ఆమెను మోసం చేసి మొహం చాటేస్తున్నాడని షారోన్ రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నరసాపురం : మండలంలోని కొప్పర్రు గ్రామంలో సోమవారం పంట కాలువలో గుర్తుతెలియని మృతదేహం కలకలం రేపింది. నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్, ఎస్ఐ టి.వెంకట సురేష్ తెలిపిన వివరాల ప్రకారం కొప్పర్రు గ్రామం నుంచి శేరేపాలెం వెళ్లే మార్గంలో జిన్నూరు చానల్‌లో మృతదేహం కాలువలోకి కొట్టుకువచ్చింది. పోలీసులకు స్థానిక విఆర్ఒ కొక్కిరగడ్డ వినోద్ సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద, సిఐ దుర్గా ప్రసాద్, ఎస్ఐ వెంకట సురేష్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి పొట్టలో కుడి వైపు పదునైన ఆయుధంతో పొడిచినట్లు, రెండు కాళ్లు కట్టి వేసి ఉందన్నారు. మృతదేహాన్ని నరసాపురం ఏరియా ఆసుపత్రిలో మార్చురీలో భద్రపరిచారు. ఆ మతుడికి సుమారు వయస్సు 30-40 సంవత్సరాలు ఉండవచ్చన్నారు. మృతదేహానికి నడుముకి నల్లటి మొలతాడు ఉంది. ఈ గుర్తు తెలియని మృతదేహంపై స్థానిక విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకట సురేష్ హత్య కేసుగా నమోదు చేశారు. దీనిపై సిఐ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు వివరాలు తెలిసిన వారు నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్ 94407 96616, ఎస్ఐ టి.వెంకట సురేష్ 94407 96618 సంప్రదించాలన్నారు.

గూటీబిళ్ల కోసం వెళ్లి..

ప్రజాశక్తి - పాలకొల్లు



గూటి బిళ్ల కోసం వెళ్లి ప్రాణం కోల్పోయిన యువకుడి ఘటన స్థానికంగా చోటుచేసుకుంది. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. పాలకొల్లు పెద్ద కుళాయి చెరువు గట్టుకు బయట కొందరు బాలురు గూటిబిళ్ల ఆడుకుంటున్నారు. ఒక బాలుడు గట్టిగా బిళ్లను కొట్టడంతో అది పక్కనే ఉన్న మంచినీటి కుళాయి చెరువులో పడింది. దీంతో బిళ్ల తేవడానికి ముగ్గురు బాలురు చెరువులో దిగారు. అయితే ముగ్గురికి ఈత రావడంతో బిళ్ల తీసుకుని తిరిగి వస్తుండగా మతిగాని హరికృష్ణ(రంగా 17) అనే బాలుడు గల్లంతయ్యాడు. దీంతో సమాచారాన్ని మున్సిపల్ అధికారులు ఉన్నతాధికారులకు తెలపడంతో నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి శ్రీవేద హుటాహుటిన కొత్త కుళాయి చెరువు గట్టుకు వచ్చి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి వెలికి తీశారు. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి శవ పరీక్షలకు తరలించారు. ఈ కేసును పట్టణ సిఐ కె.రజనీ కుమార్ సారథ్యంలో దర్యాప్తు చేస్తున్నారు.